# కడుపు సొద



ఒరే అబ్బోడా!...అమ్మి లచ్చింవీ! ఒరే నాయినా పర్దేసూ!...ఒరేవొరే ఒకసారి ఇట్టా వచ్చిపొండిరా!

ఎందుకురా అట్టా ఆసోబోసోమని పరిగిత్తాఉండారే! యాడ ఎవుడి కొంపలు అంటకపోతా ఉండాయిరా?... యాడేంవి పుట్టిమునిగిపోతావుండాదిరా?... ఒరేవొరే! ఎందుకురా అట్ల కాలికుందికీ పరిగిత్తా ఉండారే? తొందరపణ్ణె గొడ్డు తాగేది మురికి నీళ్ళేరా!... వద్దురా! అంత తొందరపాటువద్దురా. వద్దంటేకద్దని పాటుపడీపడీ ఈ పంచకు అతక్కపొయ్‌నా. వాడు యదవోసదవో? ఎట్టాంటోడు ఒకడు పిలస్తా ఉండాడుగదా! ఒక్కసారి ఇట్టావచ్చి పొండిరా!

ఒరేవొరే! పిల్లనాయాండ్లాలా! నెత్తిన నోరు పెట్టుకోని మొత్తుకుంటా ఉంటేగూడా మీ చెవల్లో పళ్ళేదే? – ఆ చెవల్లో చెట్లేమన్నామొల్సినాయా? పిలస్తాఉంటే తిరిగిమల్లీ చూడకుండా ఎవుడో ఎంటబడి తరంవతా ఉణ్ణెట్టు ఉరకతా ఉండారే?

ఆఁ!...ఎవురన్నా ఆడ వస్తాఉండేది? శివశివా! కండ్లు చించుకుంటేగూడా కనపరాలేదే?... ఆఁ! నువ్వా సిరిపిరెడ్డి చిన్నపరెడ్డన్నా. అన్నాన్నా! ఆ పిల్లనాయాండ్లు ఎట్టానామాట ఇనిపించుకునేటట్టులేదు. నువ్వన్నా ఒకమాట చెప్పన్నా. చెప్పుడు మాట్లు విని చెడిపొయ్‌నోళ్ళు ఉండారు. చెప్పింది ఈ చెవ్వులో ఏసుకొని ఆ చెవులో ఇడ్సిపెట్టేసినోళ్ళూ ఉండారు. ఈ కాలం పిలకాయిలు అన్యాయంగా చెడిపోతారు. చూస్తాచూస్తా ఊరికే ఉండేదానికవితిందా? చెడిపోతే చేరదీసేవాళ్ళు దీపెంపెట్టి ఎతుకులాణ్ణా దొరకరు. అన్నా! చిన్నపరెడ్డన్నా! ఒకమాట నువ్వన్నా చెప్పన్నా!

ఎంత సేపన్నా? ఒక వక్క కొరికినంతసేపే. అట్టా నిలబడమను. చెప్పేస్తా. మళ్ళా వాళ్ళబ్బతోడు. ఆడికి మనబాద్దెత తీరిపోతింది. గురికుదిరి గుట్టుగామట్టుగా నడ్సుకుణ్ణారా బాగుపడ్తారు. లేకుంటే ఎవుడి కర్మకు ఎవురుబాద్దులు?

అరెరె! నీమాటగూడా సట్టు చెయ్‌కుండా ఒక్క మోపన పరిగిత్తా ఉండారే పిల్లనాయాండ్లు. పోనీపోనీ! ఎంత దూరం పోతారోపోనీ. పైకిసిరేసిన రాయి మల్లా పడేది అణ్ణేకదా? వంచిన తలెత్తకుండా ఒక్క మోపన పోతాఉండారు. ఈళ్ళుగూడా యాణ్ణో ఒకచోట నిలబడాల్సిందే! నిలబడి తిరిగి చూడాల్సిందే! అప్పుడు తడుఁవుకుంటారీ యదవలు. ఏఁవిలాబం? చేతులు కాల్నాక ఆకులు పట్టుకుణ్ణెట్టు!

అయినా వాళ్ళను అని మాత్రం ఏఁవిలాబం? అది వాళ్ళతప్పుగాదు. వయసుది. ఆ వయసులో ఎవుడూ అంతే. చెప్పినా చెవల్లో పడదు. పణ్ణా ఒక్కరాగాన తలకెక్కదు!

ఇదెట్టా ఉండాదంటే?– గుడ్డుబొయ్ పిల్లను ఎక్కిరించినట్టుండాది. లేకుండాబోతే నేనేఁవో మహాబుద్ధిమంతుడిమాదిర్తో ఈ పంచకు కర్సుకోని తెగవగస్తా ఉండా. ఊరికే ఉంటే ఊరాపేరా అని దోవన వచ్చేపొయ్యే వాళ్ళందర్నీ పిల్సిపిల్సి చెప్పాలనుకుంటా ఉండా. ఆపొద్దు!... ఆహా! ఏ పొద్దు? ఆపొద్దే– ఒంట్లో అంతరసి... మోకాళ్ళలో అంత మూలగ ఉణ్ణప్పుడు నేను ఒకడు చెప్పినమాట ఇనుకోనుంటే ఇప్పుడు నేను చెప్పేమాట్లు వాళ్ళినేవాళ్ళు. ఆపొద్దేఁవో తలకాయి దమ్మిడికి అడిగితి. ఈ పొద్దు తలతలాకొట్టుకుంటే ఎవుడితలకెక్కితింది? పోనీ! ఎందుకెక్కాల?...

అదంతే. ఈ లోకంలో ఎవుడైనా అంతే. కండ్లల్లో అంతకొవ్వుంటే కండ్లే కనపరావు. చేతల్లో రోన్ని చిల్లరదుడ్డుంటే చెప్పినమాట చెవలకెక్కదు. ఆ కొవ్వట్లా కరిగిపొయ్ ఆ చిల్లర దుడ్లట్లా చేతులు మారిపొయ్‌నాయంటే– నాసాఁవిరంగా! అప్పుడు తెలిస్తింది. తెలిస్తే–కండ్లు పలపలరాలస్తాయి. తుడ్సేనాదుడెవుడు?

అందుకే చెప్తా ఉండా. ఒరే అబ్బోడా!...అమ్మి లచ్చిఁవీ!...నాయినా పర్దేసూ! నామాటట్టా వినిపించుకోండిరా. ఒకే ఒక్కసెణం అట్టా నిలబడండ్రా. నిమ్మతిగా నిలబడి నేను చెప్తే చెవల్లో ఏసుకోండిరా. ఎందుకింతగా బతిమాల్తాఉండానంటే?–

నాదేంవుండాది. అంతా అయిపొయ్యింది. కాళ్ళు బారసాపేసినా. ఒరేనాయినా! వండినకూడు వాలినపొద్దు ఒకరికోసరం ఎదురుసూస్తా ఉండమంటే ఉండవురా!

అందుకే చెప్తా ఉండా.

ఇప్పుడు నేను గొంతట్టా చించుకుంటా ఉంటే గూడా మీకు చెవల్లో పళ్ళేదు. నేను పడ్తా ఉండేబాధ మీకు చీమకుట్నెట్లు అనిపించలేదు. ఏంచేద్దాం?– కాలంవట్టా మారిపాయ. అదే ఒకప్పుడైతేనా?– నాసాంవిరంగా! నామాటంటేమాటే. వాడు మహామహామత్తేబైనా ఆపూట బత్తేనికిలేనోడైనా నిలబడరా అంటే– నిలబడాల్సిందే!

హూం! మణుసులేంది? నిమ్మపొందు నిలబడమంటే నిలబడ్తాఉండె–మీసాలమింద!

మూడుప్పురాళ్ళు కిందబెట్టి వాటిమింద బొచ్చుపెరికేసిన టెంకాయపెట్టి పిడికిలి బిగించినానంటే– టెంకాయి పిచ్చుల్పిచ్చులై దిక్కుకొగిటయ్యేవి!

చెరుకు గెడను కుడిచేత్తో పట్టుకొని ఎడంవ చెయ్యి పిడికిలిబిగించి కుడిచెయ్యి పైకిత్తినానంటే– దెబ్బదెబ్బకొక గెణుపు!

గూటంకొండ కుప్పమింద నిలబడుకోని గొంతిస్తే ఆంవడదూరాన మేస్తాఉణ్ణె ఆవులైనా తోకలెత్తుకొని పరిగిత్తావస్తా ఉండె!

ఇదెంతా అట్టా పక్కనబెట్టండి. గోయిందు రెడ్డోళ్ళ ఇంట్లో ఎర్రెద్దు. దానిపొగురు పొయ్యిపాలుగానూ. మణిసిని జూస్తే పొగురుబోతు గుర్రం మాదిర్తో ముంగాళ్ళు మిందికెత్తతా ఉండె. అటుమంటిది ఒక్క అదిలింపు అదిలిస్తే పుర్రుబార్తా పిల్లిమాదిర్తో తోకముడ్సుకుండా ఉండె.

ఆపాయకట్లో ఆడామొగ మొగోడంటే వాడురా! అంటా ఉండిరి.

ఆ తెంపు...ఆ ముంపు.... మెలిదిరిగిన కండలు... ఆ కండల్లో కొవ్వు–ఏంవయిపాయ. నిర్దాచ్చిణ్ణంగా కాలం కొంచింకొంచింగా నంజేస్తే ఏంవయిపోతి. ఇద్దోయిట్టా గువ్వయిపోతి. ఈ పంచన ముడక్కపోతి. పిలిస్తే పలికేవోళ్ళు లేకపొయ్‌రి. పలికితే నిలబడేవాళ్ళు లేకపొయ్‌రి. నిలబడ్తే చెప్పినమాట చెవల్లో యేసుకుండేవోళ్ళు కరువైపొయ్‌రి. ఏంచెయ్యమంటారో చెప్పండి.

లెయ్యాలంటే లెయ్‌లేను. చస్తాబతకతా లేస్తే కూసోలేను. కడుపుజించుకుంటే పడేదెక్కడ? కాళ్ళమిందనేగదా? అట్లని నిమ్మళం చేసుకుందాంవంటే ఈపాడు మణుసు ఉండదే? ఏంచెయ్యాల? ఈ బూంవికి బరువుగా... అయినోళ్ళకు అడ్డంగా– ఈగిరంసెణ్ణె బతుకు ఇంకా ఎంతకాలం బతకాల్నో? ఏంవో? ఒక్కొక్కసారి అనిపిస్తింది– ఎందుకీ ముదనష్టం బతుకని. అది ఏంద్దైనాకానీ అనుకుండేదంత సులువు ఇంగొకిటుండదు. అట్లని అనుకుంటే సరిపోతిందా? బతికేది బతక్కపొయ్యేది మనచేతుల్లో ఉండేటట్టుగా ఉంటే ఇంకేంవుండాది?

బతకాలనుకుంటే ఈబూమ్మీద బతకబొయ్యేదిలేదు. చావాలనుకుంటే చచ్చిపొయ్యేదిలేదు. తీరిపోతే– వాడెటుమంటివాడైనా ఎలబారిపోతా ఉండాల్సిందేగదా?– ఈ బతుక్కు కతలు కూడా

మతికొస్తా వుండాయే? అవును. కొన్ని కతలు మర్చిపోదామంటే గూడా మరుపురావు. బారతంమిట్టమింద అయ్యోరు చెప్పినకత. మహన్నబావుడు ఇప్పుడు చెప్తాఉంటే ఇనినట్టుండాది. వాడెవుడో ఒకరాజంట. ఆరాజుకు 'నీకు పాంవు చేత గండం' అని ఎవుడో శాస్త్రం చెప్పెనంట. ఆమాట్తో నువ్వూనేనైతా అదిరిపడిచస్తాం. వాడికేం? మారాజు. సముద్రంలో ఒంటిస్తంబం మేడగట్టించెనట. ఆ మేడలో కాలిమిందకాలేసి కూసోని 'ఈడికెట్టొస్తిందిలే పాంవు?" అని కులకతా ఉణ్ణెంట. వాడు రాజయితేమాత్రం రాతను తుడ్సేసే దానికవితిందా? అదిరానేవచ్చె నంట. ఎవుడో ఒకడు ఒకనిమ్మపొండు తెచ్చిస్తే ఆ పొండులోనే పుట్టెనంట. పుట్టిందే కర్సేదానికి!– ఇంక కరవకుండా ముద్దు పెట్టుకుంటిందా?–

అటుమంటప్పుడు చచ్చేది బతికేది మనచేతుల్లో యాడుండాది?

అయినా నేనొక పిచ్చినాకొడుకును. మనరాత మనచేతుల్లోనే ఉండాది. చేతుల్లో ఉణ్ణె దాన్నే శాతగాకుండా చేసుకుణ్ణె యదవను నేను. చేతుల్లో లేనిబతుకునుగురించి పెద్దమొగలాయి మాదిర్తో ఆలోచిస్తా ఉండా. నన్ను తలదన్నే ఎర్రోళ్ళకు ఈలోకంలో తక్కవ లేదులే?

ఈ లోకంలో ఎట్టాంటి మొనగోడికైనా ఎట్టలేదన్నా యాపకాయంత ఎర్రి ఉండనే ఉంటింది. అదే వగలేకుండాపోతే యాపకాయంత ఎలక్కాయంత అవితింది. అదేగనక ఉంటే యాలగ్గింజంత చేసుకోవచ్చు. అందుకే చేసుకున్నోడికి చేసుకుణ్ణంత!

నేనిట్టా చేసుకుణ్ణాను కాబట్టే నాబతుకు ఇద్దో ఈపంచన ఇట్టా తెల్లారింది. ఒక బతికినబతుకు గాకుండా చచ్చినబతుకు గాకుండా అలోరాంవచంద్రా! అని అగోరిస్తాఉండా. నాగెతి మీకోసరం ఎదుర్నూడ రాదనేగదా ఇద్దోయిట్టా నెత్తిన నోరుబెట్టి మొత్తుకుంటా ఉండేది.

ఒరే అబ్బోడా!...అమ్మీ సుబ్బులూ!...ఒరే వొరే ఎంగటేసూ!...నాయినా పర్దేసూ!– ఒక్కసారి ఇట్టారండ్రా. చెప్పేదట్టా చెవల్లో యేసుకోండిరా!

ఇద్దో చెప్తా ఉండా. మీమేలుగోరి చెప్తా ఉండా. చెడిపోతే ముందుపోతాఉంటేచూసి ఎనకాలనవ్వేనాకొడుకులే. ఆగెతిమీకు పట్టగూడదనేనాబాద. ఇద్దో చెప్తా ఉండా. ఈ గురుడు గుట్టెక్కిపోతే– నెత్తీనోరు మొత్తుకుంటేగూడా చెప్పేనాదుడుండడు. అందుకే ఇప్పుడే చెప్పేస్తా ఉండా. "తూబెహ! ఈ కాటికి కాళ్ళు ముదుసుకుణ్ణె ఈ ముసిలోడు చెప్పేదేంది? మేంవినేదేంది?' అనుకోకుండా రండిరా. ఒక్క సెణం అట్టా నిలబడండిరా. నిలబడి ఇనండి. ఆతరవాత మీయబ్బ తోడు!

ఈ పొద్దు ఎందుకింత అంగలారస్తా ఉండానంటే?– ఆ పొద్దు. పొద్దు గూట్లో పడ్తా పడ్తా ఉండాది. తుడుంమింద దెబ్బపడె. ఊళ్ళోచెవులన్నీ అట్టా తిరిగె. తలారోడు అందుకుండె. "ఇందుమూలంగా యావన్మందికి తెలియజెప్పేదేమంటే?– ఈ పొద్దు రాత్రికి రచ్చబండకాడ గవర్నమెంటోళ్ళు బుర్రకత చెప్పిస్తా ఉండారు. ఆ కత చెప్పేది అల్పసొల్పమైన పార్టీగాదు. రేడియోలో చెప్పేవాళ్ళు. టీవీలో పాడేవాళ్ళు. అటుమంటోళ్ళు చెప్పేకతను అందురూవచ్చి ఇనాల్సిందహో!" అని.

ఊరు మాటుమణిగే యాళకాడ. కురుకురుమీసం వచ్చే కుర్రకారంతా కలబలుక్కుంద్రి. నిమిశాలమింద రచ్చబండకాడ పందిలేసిరి. పందిలికి మావిడాకుల తోరణాలు కట్టిరి. అంటిమాకులుదెచ్చి నిలబెట్టి కట్టిరి. రంగురంగు దీపాలు ఎలిగించిరి. ఊళ్ళో నడీది గంగమ్మతిరణాల జరిగినట్టుండాది. కుండాచట్లల్లో నీళ్ళుపోసి ఊరూరంతా ఆడుడ్డజేరె!

నలగర్తోనారాయణా అని నేనూ ఆడికిపోతి!

గుమ్మితిమింద దెబ్బపడె!– పరవాలేదనుకుంటి

గొంతెత్తిరి. 'బాగుండాదే!' అనుకుంటి.

అట్టనుకోని కూసుంటే వాళ్ళు చెప్పిన కతేందో తెల్సునా?

అంహా! పొద్దు మొలిసింది మొదులుకోని పొద్దుగూట్లోపడేదాకా వంచినడుం ఎత్తకుండా మట్టిపిసుక్కుండే మణుసులుగదా! నరం జినిగేటట్టు పోరకలాడ్తేగూడా నాలుగేళ్ళు నోట్లోకి పోలేనిబతుకులుగదా? వాళ్ళకేఁవన్నా సిల్మాలా! పోనీ! డ్రామాలా? వాళ్ళూ మణుసులేగదా? రోంచేపైనా తఁవాసగా ఉండాలనుకుంటారుగదా! అని అనుకోవాల్నాపన్లేదా? అట్టనుకోనుంటే ఆయదవలు ఏకాఁవమ్మకతో... బాలనాగమ్మకతో... ఎంటికిలు నిక్కబొడ్సుకుండే దేసింగురాజు కతో చెప్పాలగదా? లేదే?... వాళ్ళుచెప్పేది ఇంటావుంటే నాకు అరికాలిమంట ఉచ్చికెక్కె. నాపని పల్లేరికాయిలమింద కూసుణ్ణిట్టాయ. అంతే! తుండుగుడ్డెత్తి ఇదిలించి బుజానేసుకోని లేస్తి!

"రే! చాల్సాలుగని ఆడికి నిలపండ్రా మీకత!" అంటి.

మాట్తోగూడా నిలిపేసిరి బిడ్డలు. నిలపకుండా ఏంజేస్తార్లే? మాటకుమాట మాట్లాడి ఎదురుగా నిలబడుకుంటే మొగోడింకొకడు ఆ ఊళ్ళో ఉంటే ఇంకనేనొక మొగోడని చెప్పుకోవాల్నా?

ఎడఁవచెయ్యి ఒక్క ఊపులో పైకిలేసె. లేసిన చెయ్యి పందిలిమీదపడె. పణ్ణేచేతికి ఒక కట్టెవచ్చె. ఆకట్టె రొండు బార్లపొడుగుండె. రొండు చేతుల్తో పట్టుకొని మోకాలుమడ్సి ఒక కుమ్ముకుమ్మితే రొండాయె. ఒకదాన్ని కుడిచేతికెత్తుకుంటి!–

అంతే!... మెళ్ళో గుమ్మతిలు మెళ్ళోనే ఉండాయి. పరుగందుకుంద్రి నాయాండ్లు. అయినా ఇడ్సిపెడ్తినా? లేదే. తరిఁవినా. యాటకుక్క ఎంటబడి తరిఁవినట్టు తరిఁవినా. కయ్యాలే!... కాలవాలే!... కంపాలే– పడ్తాలేస్తా తిరిగిచూసుంటే ఒట్టు!

మీరే చెప్పండి!

ఇద్దరికిద్దరేచాలని ఈయదవలేంది చెప్పేది?

కావాలంటే కనుక్కుండేది. వద్దనుకుంటే చాలించుకుండేది. మనచేతుల్లో పనా? అది మనచేతుల్లో ఉంటే ఇంకేఁవుండాది. మల్లా దేవుళ్ళెందుకూ?

అదొకపనిగా ఊళ్ళమిందబడి ఇదేనా ఈయదవలుచెప్పాల్సింది?

ఆహాఁ! అడువుల్లో మృగాలుండాయి. పచ్చులుండాయి. నీళ్ళల్లో శాపలుండాయి. కప్పలుండాయి. ఇంక కొంపలకాడికొస్తే చీమలుండాయి. దోఁవలుండాయి. ఇవిటికంతా ఎవుదు పెడ్తా ఉండాడంత తిండి?

నారుబోసినోడు అన్నినీళ్ళుబొయ్‌లేడా?

ఇద్దురికిద్దురు చాలని మొరగతారే ఈయదవలు. వాళ్ళకు నోరెట్టాడిందబ్బా? అట్టను కోనుంటే నేనూలేదు. మా అయ్యాలేదు. వాళ్ళయ్యాలేడు. ఎందుకంటే నేను మా అయ్యకు ఎంచినట్లు ఏడోవాణ్ణి. మా అయ్య వాళ్ళయ్యకు ఎనిమిదోవోడు. వాళ్ళయ్యకు పదోవోడు.

అదట్టా దొంగలు తోలుకోనిపోనీ! గొడ్డుబోతుళ్ళుండారుగదా? వాళ్ళకుపుట్టించమను బిడ్డల్నిచూద్దాం. శివుడాజ్ఞలేంది చీమైనాకుట్టదని ఊరికేఅన్నారా? ఆమాత్రం ఎరక్కుండా ఎట్టంటే అట్టా వాగితే అప్పిటికి నేనీ ఊళ్ళో పాణంతో ఉణ్ణెట్టా? లేనట్టా?

బుద్ధిగెడ్డితిని ఆ పొద్దు అట్టానే ఆలోచించినా!

ఆలోచిస్తే ఏఁవయింది? చూస్తా ఉండారుగదా! ఇదో ఈగెతి పట్టింది.

ఎందుకుపట్టింది? ఎట్లా పట్టిందంటారా! మీరు అడగాల్సినమాటే!

అది చెప్పే దానికేగదా ఈ ఏడుపంతా!

పొగులంతా పొలంలో... రేత్రిఇంట్లో! పాలుమారకుండా పొరకలాణ్ణా. పాలుమార్తివా? బయిశార్తివా? అన్నారుగదా పెద్దోళ్ళు. అందుకే అట్టమడికాడ ఇట్ట ఇంటికాడ పాలుమారకుండా పెద్దోళ్ళపేరు నిలబెట్నా.

ఆపొరకాటం ఉర్దాగా పోలా!

నాకు అయిదుమంది కొడుకులు. ఆరుమందికూతుళ్ళు!

ఆ ఏటాబాలింతరాలి కత అడికి అయిపొయ్యింది.

ఏసినపడక ఏసినట్టే!

చెట్టుకాస్తావుండాదని దానిమొగాన నీళ్ళునిప్పులుకొట్టకుండా ఎరువులెంపలు ఎయ్‌కుండా కాపుమిందనే కన్నేస్తే ఏఁవయింది? ఏనాటికోఒకనాటికి ఎండిపోతింది.

సవురు లేకపోతే దీపెం ఆరిపోతింది.

ఇది పొయ్ ఒకరు చెప్పాల్నా? పన్లే. అయితే నామాదిర చేతగాకుండా చేసుకుండే యదవన్నరయదవలకు మాత్రం చెప్పాల్సిందే!

పాపం! అదిమాత్రం ఏంజేస్తింది? ఏఁవీ చెయ్‌లేకనే ఎలబారిపొయ్యింది.

దానిమాట మణుసులో మెదిల్తే మణుసుఎట్టెట్నో పోతింది. కడుపులో చెయ్యేసి దేవినట్లవితింది!

గుడ్డోడిచేతిలో ఊతకట్టె ఉణ్ణెట్టు... చీగిట్లోచేతిలో ఒకదీపెం ఉణ్ణెట్టు అదినాబతుక్కు ఒక ఆదారంగా ఉండె!– నేను తొలికోడి కూసేయాళకాడ నిద్దర లేస్తే నాతో కూడా లేస్తా ఉండె. అది పొరక చేతికెత్తుకుంటే నేను చెత్తాసెదారం దిబ్బకెత్తతాఉంటి. నేను చేదబాయిలో నీళ్ళు చేదిచేది పోస్తా ఉంటే అది తెచ్చి తెచ్చి పోసుకుంటా ఉండె. నేను మోటగట్టే అది పార చేతబట్టి కయ్యలకు నీళ్ళుకట్టాఉండె. అడివిమింద పడ్తే– నాతో పోటీపడ్తా మోపు కట్టెలు తెస్తాఉండె!

మేంవు ఒకరిపక్కన ఒకరు దోవబట్టి నడస్తాఉంటే? ప్చ్! ఎందుకులే ఆకత!

పాణంలో పాణంగా బతకతా ఉణ్ణి దాన్ని అన్నాయంగా పాణం తీసేస్తి. తీసినా అయినా నేను మాత్రం ఇప్పుడేం వారుకుంటా ఉండా?

ఆడదాని చేతిలో అర్తం దక్కదంటారు. దానిచేతిలోనా? పాలు పొంగినట్టుపొంగతా ఉణ్ణే! నా చేతిలోనేగదా పదకొండుమంది బిడ్డలు పదారు దోవలయింది.

నేనుమాత్రం ఏంచేసేది?

ఒంటి చేత్తో నీళ్ళుతాగితే తాగినట్టుండదంట. ఒంటి చేతికాపరంవూ అంతే! అందుకని అది బిడ్డల్నుగాలికొదిలేసి నాతో కూడామాడ పనిచేస్తా ఉండె. గాలికి పెరిగిన బిడ్డలు గాలికే కొట్టుకొని పొయ్‌రి!

నాకు ఎంత ఉండె బూంవి? ఐదెకరాలు. అయిదు మంది కొడుకులు అయిదు రొండ్ల పది చేతులేసి ఉంటే– ఇంకా పదిపదిఇరవైమంది బతికేవోళ్ళు.

దున్నపోతైపుట్టే దున్నిచావాలంట. అన్నదమ్ముళ్ళైపుట్టే ఏర్లు పోవాలంట. పొయ్‌రి. పోతే ఏమాయ? ఒకొకడికి ఒక ఎకరా వచ్చె. పోనీ! దాన్నయినా నిలబెట్టుకుణ్ణారాయదవలు? అదిగూడా అమ్ముకుండ్రి. అమ్ముకుంటే ఏంవాయ? చేసిన సారాయి నీళ్ళబాకీలు తీరె!

చెడపుట్నె నాకొడుకులు పువ్వులమ్మినచోట్నే కట్టెలు అమ్మతా ఉండారు.

కాలం మారిపాయ. ఈ కాలం పిలకాయలు ఎవుడు గెడిసేపు నడుంవంచి పనిచేస్తా ఉండాడు? ముంజేతులు మునిగేటట్టు చొక్కాయి పాదాల్దాకా సొరాయి తగిలించుకుండేది. గొంతులో రొన్ని కాపీనీళ్ళు పోసుకుండేది. తిరిగిచూడకుండా పొయ్ ఆ గుంటకట్టమింద కూసుండేది. ఊరికే కూసుంటే ఊరాపేరా? కొందురు పులిజూదం ఆడ్తే కొందురు కాగితాలాటాడేది.

ఇంక పండమంటే పండతాయి పంటలు. బాగుపడమంటే ఊళ్ళు బాగుపడ్తాయి!

ఈ పిలకాయిలు తలకాయిలకు చెప్పులు ఆడగతా ఉంటే ఇంక వానలు కురవమంటే ఎట్టాకురస్తాయి? వానలు కురవబొయ్యేదిలేదు. పంటలు పండబొయ్యేది లేదు. పండకపోతే ఏంచెయ్యాల. మణుసుల్ని మణుసులే పెరక్కతినాల. నా ఎర్రిపాయ్ ఏట్లోపడ! –ఇప్పుడు మాత్రం పెరక్కతినకుండా ఉండారా? –

ఎవురే ఏట్లోబోతేమనకెందుకు? అని అనుకుందాంవంటే ఉండ్లేదే ఈ పాడు మణుసు. ఈ లోకంలో మణుసుండే నాకొడుకులు ఎవురూ రతికెక్కరు!

ఎవుడికతో ఎందుకు? నాకతే ఎత్తుకోండి. ఈ ఊళ్ళో ఎచ్చుతక్కవగా నూరుగడప ఉండాది గదా? నేను తొక్కని గడప ఒక్కటుండాదా? ఎవుడికి ఏ కష్టం వచ్చినా నాకేవచ్చిందనుకుంటి. ముక్కునొచ్చినా మూతినొచ్చినా ముందు నేనుంటా ఉంటి. ఈ పాపిష్టి చేతుల్తో ఎన్ని పాడెలు కట్నానో? ఎన్ని పీనిగిల్ని ఈబుజాలమింద మోసినానో? ఎంతచేస్తే మాత్రం ఎంవుండాది? చేసినంతసేపు చెయ్యించుకుంద్రి. కాలూచెయ్యి సక్కరంగా ఉణ్ణెంతకాలం నేనూ చేస్తి. ఊరికింత ఉపకారం చేసినాడే? కాలూచెయ్యి ఉడిగి పంచనపడి గోరస్తా ఉండాడే? అని కడుపుకు కూడుతినే ఏయదవయినా తల్సుకుంటా ఉండాడా? కుయ్యో మొర్రో అని మొత్తుకుంటా ఉంటే 'ఏంవిరాపాపుడా?' అని పలకరించేనాదుడుండాడా? పలకరించకపోతే పీడాకిటిపాయె. వాడికొడుకులిట్టా కూతుర్లట్టా అని పడాసికాలాడ్తా ఉండారే?

కూతుళ్ళ మాట తల్సుకుంటే కూడు ఉడికినట్టు ఉడికితింది కడుపు!

ఇద్దోనేనా! కాలూచెయ్యి ఆడకుండా ఇట్టా పడుండా. ఇంక కూడా పుట్నె యదవలా? కూలిచేస్తే కుండగాలే బతుకులు. ఇంట్లో ఆడదా? అందుర్నీ అన్నాయంచేసి దానిదోవ అది చూసుకుండె!

ఇంక ఆడబిడ్డలేంజేస్తారు?

పెద్దమ్మి పెండ్లిగాకముందే కడుపుదెచ్చుకుండె. కడుపుజించుకుంటే కాళ్ళమిందనే పడ్తిందని కడుపులో యేసుకోని దాన్ని అంత నాటుమొందు మింగమంటే మొదుటి పాణానికే మోసం వొచ్చె!

రొండోది అంతకన్న మంచిపనిలేదని ఎవుడితోనో లేసిపాయ. యాడుండాదో? ఎట్టబతకతా ఉండాదో ఆ మండేవోడికేఎరిక!

"పెద్దక్క మాదిర్తో చెయ్‌రానిపనీచెయ్యను. చిన్నక్కమాదిర్తో సిగ్గూసెరంలేకుండా లేసిపోను. నేను నేనుగాబతకతా!" అని మూడోది తలొంచి తాళికట్టించుకుండె. ఈళ్ళందుర్నీ ఎదిరించి నిలబడుకుండె. నిలబడుకుంటే ఏమాయ? - ఊళ్ళో వాళ్ళ కతలట్లా పక్కనబెట్టు. కూడవుట్నోళ్ళే కాకులైరి. 'కడజాతోణ్ణికట్టుకుణ్ణె కస్మాలపుముండా! మాకండ్ల కెదురుంగా ఉణ్ణాంవంటే నిలవనా చీరేస్తాం. డబ్బాకిర్సనాలు పోసి కాల్చేస్తాం!' అంటా డప్పాలు కొట్తాఉండారు.

ఆబిడ్డా! 'ఏంజేస్తారో చేసుకోండి చూద్దాం!' అంటా ఎగటాయించి కూసుణ్ణింది.

ఒరే అబ్బోడా!... అమ్మి లచ్చింవీ!... నాయినా పర్దేసూ!... ఓరయ్యా ఎంగటేసూ! - మీరన్నా చెప్పంద్రా. ఇదినాయంవేనో మీరే ఆలోసించంద్రా!

అంహా! నేనెట్టా దానిమెళ్ళో మూడుముళ్ళు ఎయ్యించలేక పోతి. రగతం పంచుకోని పుట్నెయదవలగెతి కూడా ఆడికే ఏడ్సింది. అది ఎవుణ్ణో ఒకణ్ణి మెచ్చినోణ్ణి తాను నచ్చినోణ్ణి చేసుకుండె. దాని బతుకది బతకతా ఉండాది. నడిమిద్దె ఈళ్ళకెందుకూ ఈగుల?

ఏఁవి? కడజాతోడైతే మాత్రం ఏఁవి? కన్నుగుడ్డా? కాలుకుంటా? పోనీ! వాడేం మణిసి గాదా? వాడికి మణుసులేదా? ఈయదవలకంటే వాడేమేలు గదా?– కట్టుకుణ్ణెదాన్ని గడపదాటకుండా ఏలుకుంటా ఉండాడు.

ఒరేనాయినలారా? వాళ్ళజోలికి పోవద్దని మీరన్నా చెప్పండ్రా!

హుఁ! ఎవుర్తో చెప్పుకోనిమాత్రం ఎఁవిలాబం? చేసుకుణ్ణోడికి చేసుకుణ్ణంత! అందుకే మణిసిగాపుట్టే ముందుచూపు ఉండాలంటారు. అదేలేకపోతే మణుసులకంటే గొడ్లేమేలుగదా?

వద్దు నాయినావద్దు. ఈగెతి పగోడిక్కూడావద్దు. ఎంత మొత్తుకుణ్ణా ఈ కడుపుసొద ఆరేదిగాదు. తీరేదిగాదు!

రచయిత:

'సుజలాం సుఫలాం సస్యశ్యామలాం!' అని కీర్తింపబడిన ఈ పవిత్రదేశంలో సౌభాగ్య సీమలైన ఎన్ని పల్లెల్లో? ఇలా ఎన్ని కడుపుసొదలో??

అది ఒకానొక పల్లె. ఆ పల్లె నడిమయాన ఒక మూడంకణాల పూరిల్లు. ఆ పూరింటి ముందర మూడుమూడు ఆరు మూరలపొడవు... ఒక్కటిన్నరమూరవెడల్పు తిన్నె!

ఆ తిన్నెమీద ముకుందయ్య.

కడుపులో పుట్టిన నేరానికి ఏ కొడుకైనా ముకుందయ్య మొగాన అంత తిండి కొట్టే కొట్టవచ్చు. అక్కి ఎండకపోతా ఉండాదని అఘోరించినా చారడు నీళ్ళు గొంతులో పడకపోవచ్చు. కానీ ముకుందయ్య కడుపుసొద నిత్యపారాయణం మాత్రం ఆపినా ఆగదు.

వినేవాళ్ళు వింటారు. వినీవిని విసిగిపోయిన వాళ్ళుమాత్రం "ఈ ముసిలోడికింకేం పనీపాట లేదబ్బా!" అని సొణుగుతుంటారు.

ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. ఆ అభిప్రాయాలతోనిమిత్తంలేకుండా ముకుందయ్య నిత్యపారాయణం మాత్రం నిత్యనూతనంగా సాగుతూనే ఉంటుంది.

అయితే ఉన్నట్లుండి ఒకదినం ఆ పారాయణం ఆగిపోయింది!

"అయ్యోపాపం! ముకుందయ్య చచ్చిపొయ్‌నాడే?" అన్న ఒక్క సానుభూతి వాక్యంతో ఊరు సరిపెట్టుకొనింది. అయితే–

"ఒరే గుడ్డినాయాండ్లాలా! చచ్చిపొయ్‌నాడో? చంపేసినారో కండ్లుదెర్సి చూడండ్రా. మీరు అన్నెట్టు చచ్చిపొయ్యుంటే ఆ గొంతు ఎందుకట్టాకఁవిలిపోతింది. మెడకింద నరాలు ఎందుకట్లా ఉబ్బుకోనుండాయి? ఎవురు పుణ్ణెం గట్టుకుణ్ణారో ఏంపాడో?"

కండ్లు మాత్రమేకాదు– మనసున్నవాళ్ళ గుండెలు గొంతుల్లో మాటగామారింది.

చనిపోయాడో? లేదు చంపేశారో? ముకుందయ్యలేదు. నిత్యపారాయణమూ లేదు.

ఆత్మీయతలు... అనురాగాలు... న్యాయాలు.... ధర్మాలు... పల్లెల్లో కలపలుక్కొని అటకలపైకెక్కి కూర్చున్న ఈ రోజుల్లో ఒకే ఒక్క ధర్మం మాత్రం నాలుగుపాదాలమీద నిలబడి ఉంది.

తలా ఒకచెయ్యివేశారు.

ముకుందయ్య శాశ్వతంగా మట్టిలో కలసిపోయాడు!

అయితే-

ఆ తిన్నెమీద గుడ్లగూబ మాదిర కూలబడి ప్రతినిత్యం అదే పనిగా దుమ్మెత్తిపోస్తూ ఉంటే- తమ పరువుప్రతిష్ట గంగపాలవుతూ ఉందని ముకుందయ్య అయిదుమంది కొడుకుల్లో ఒకడు తప్పతాగి తండ్రి గొంతు పిసికి చంపిన సత్యం వాడికి... వాడితండ్రికి... ఆపైన దేవుడనబడే వాడు ఒకడు ఉంటే వాడికిమాత్రమే తెలుసు!

రాజ్యకాంక్ష గొంతులు కోయించడం చరిత్రచాటుతున్న సత్యం. పరస్త్రీ వ్యామోహానికి గొంతులు తెగడం పరిపాటే. కక్షలు కార్పణ్యాలకు అహుతి అయిన గొంతులెన్నో? ఆస్తిపాస్తుల తగాదాలకు హారతులెత్తిన గొంతులెన్నో? వ్యవస్థ మార్పుకు తీర్పు చెప్పలేని అమాయక గొంతులెన్నో? పదవికోసమో! దానిని నిలబెట్టుకోవడానికో టౌన్‌బస్సు చక్రాలకింద ఎన్ని గొంతులో?- కానీ పరువు నిలబెట్టుకోవడానికి తండ్రి గొంతునే కొడుకు పిసికి చంపిన దేశంలో పుట్టిన రచయిత నేను!

ఈ కడుపుసొద ఎవరితో చెప్పుకోమంటారు? ●

ఆంధ్రపత్రిక
24, నవంబర్ 1982